క్లుప్తంగా

ఆలయ వార్షికోత్సవం

అంబాజీపేట: గంగలకుర్రు శివారు రావులమ్మ పానాటం వద్ద వేంచేసిన రావులమ్మ అమ్మవారి వార్షికోత్సవ వేడుకను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అరిగెల రాబాబు ఆర్థిక సాయంతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. జయంతి భాస్కర సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన చేపట్టారు.

పూర్ణాహుతితో క్రతువులకు ముగింపు



హోమంలో పూర్ణాహుతి సమర్పిస్తున్న ఈఓ

అయినవిల్లి: విఘ్నేశ్వరుని సన్నిధిలో మూడురోజుల పాటు నిర్వహించిన విశేష క్రతువులకు మంగళవారం పూర్ణాహుతితో వేదపండితులు ముగింపు పలికారు. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి పర్యవేక్షణలో స్వామి సన్నిధిలో గణపతి పూజ, గవ్యాంతం, సూర్యమండపారాధన, సూర్యనమస్కారాలు, మహా పూర్ణాహుతి వంటివి నిర్వహించారు. ఆలయ ఈఓ, ఏసీ ముదునూరి సత్యనారాయణరాజు పర్యవేక్షణలో ఈ పూజలు జరిపారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి సాయం



బాధితుడి తల్లికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు మంగళవారం రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. మండలంలోని దేవరపల్లి గ్రామానికి చెందిన నక్కా రాజ్ కుమార్ (24) పెయింటింగ్ పని చేసుకుంటూ భోజనాలు క్యాటరింగ్ పనికి వెళుతుంటాడు. ఇటీవల మండపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రాజమహేంద్రవరం హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. రూ.3 లక్షల వరకు ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పారు. పనిచేసుకుని బతికే రాజ్‌కుమార్ తల్లికి అంత ఆర్థికస్తోమత లేక కాశీ అన్నపూర్ణా దేవి సేవా సంస్థ సభ్యులను సహాయం కోరగా సంస్థ సభ్యుల చేతుల మీదుగా రాజ్‌కుమార్ తల్లి రాధకి రూ.10 వేల చెక్కును సాయంగా అందజేశారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

అయినవిల్లి: కొట్లాట కేసులో ఇరువర్గాలపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.మనోహరజోషి తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లి మండలం తొత్తరమూడికి చెందిన నేదునూరి సుమంత్, లోకేసు, ఉదయ్‌లు మోటార్‌సైకిల్ పై ముక్తేశ్వరంలో ఉన్న వంట ఇల్లులో కూరలు పార్శిల్ చేయించుకునేందుకు వెళుతున్నారు. ఈ సమయంలో విలస గ్రామానికి చెందిన కూటం జనార్దన్ అనే వ్యక్తి వారి వెనుక మోటార్‌సైకిల్‌పై వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో వీరి మధ్య వివాదమైంది. ఇది మాటామాటా పెరిగి ఇరువర్గాలు కొట్టుకున్నారు. ఈ కొట్లాటలో వీరికి గాయాలయ్యాయి. దీనిపై ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

థ్యాంక్యూ మోదీ

కొత్తపేట: ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని ఆర్థిక నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేద, సామాన్యవర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయడంపై బీజేపీ యువమోర్చా 'థ్యాంక్యూ నరేంద్రమోదీ' అంటూ పోస్టు కార్డులు కార్యక్రమం చేపట్టింది. రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి, రాష్ట్ర యువమోర్చా అధ్యక్షుడు మిట్ట వంశీ ఆదేశాల మేరకు బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి పాలూరి జయప్రకాష్ నారాయణ (జేపీ) ఆధ్వర్యంలో మంగళవారం పీఎంకు ధన్యవాదాలు తెలియజేస్తూ పోస్టుకార్డులు రాసి, స్థానిక తపాలా కార్యాలయంలో పోస్టుమాస్టర్ విఠల్‌నాథ్‌కు అందజేశారు. కార్యక్రమంలో మండల యువమోర్చా అధ్యక్షుడు వలపశెట్టి కిరణ్‌తేజ్, సభ్యులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వీఆర్వోల వినతి

రావులపాలెం: గ్రామ రెవెన్యూ అధికారులను గ్రేడుల నుంచి తొలగించి వారికి డీడీఓగా పంచాయతీ సెక్రటరీలను తొలగించి తహసీల్దార్‌ను నియమించాలన్నారు. అలాగే రెవెన్యూ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని కోరుతూ మండల వీఆర్వోల సంఘం ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందించారు.

పది రోజుల్లో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి

పి.గన్నవరం: ఏజీ రోడ్డు ఆధునీకరణ పనుల్లో భాగంగా పి.గన్నవరం సెంటర్ నుంచి పోతవరం కళ్యాణ మండపం వరకూ నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను పది రోజుల్లో పూర్తి చేస్తామని ఆర్అండ్‌బీ ఎస్ఈ జి.కాంత్ తెలిపారు. సీసీ రోడ్డు పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. నెల రోజుల్లో ఈ రోడ్డుపై వాహనాల రాకపోకలకు అనుమతి ఇస్తామని వెల్లడించారు. పోతవరం వద్ద 360 మీటర్ల మేర కుంగిన రహదారి వద్ద మట్టి నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపామన్నారు. మట్టి నివేదికల ఆధారంగా మూడు పద్ధతుల్లో ఏదేని ఒక దానిని ఎంచుకుని ఈ రోడ్డును పటిష్టం చేస్తామన్నారు. ఆయన వెంట ఈఈ బి.రాము, డీఈఈ జి.రాజేంద్ర, జేఈ మణికుమార్ ఉన్నారు.

సాగునీరు అందక రైతుల ఇక్కట్లు

- వరినాట్ల దశలోనే ప్రారంభమైన నీటి ఎద్దడి
- నిధుల లేమితో కాలువలు అస్తవ్యస్తం
- వంతుల వారీ విధానంతో రైతుల ఆందోళన

ఆలమూరు: తూర్పు డెల్టా ప్రాంతాల పరిధిలో సాగునీటి సంఘాలు ఏర్పాటు చేసినా నిధులు మంజూరు కాకపోవడంతో పంట కాలువల్లో సక్రమంగా సాగునీరు పారడం లేదు. ఇప్పటి వరకూ అరకొరగా విడుదలవుతున్న సాగునీటిని శనివారం నుంచి విడతల వారీగా విడుదల చేయడంతో శివారు ప్రాంతాల వరిసాగు ప్రశ్నార్థకంగా మారింది. తూర్పు డెల్టా ప్రధాన కాలువ ద్వారా ఆలమూరు లాకుల నుంచి చింతలూరు మీదుగా వెదురుమూడి వైపు వెళ్లే చింతలూరు కొత్త కాలువలో అసలు సాగునీరు రావడం లేదు. ఏళ్ల తరబడి ఈ కాలువపై ఇరిగేషన్‌శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రైతులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఇప్పటికే వ్యర్థాలు, కలుపు మొక్కలు పెరిగిపోవడంతో పంట కాలువ చిట్టడవిని తలపిస్తూ అధ్వానస్థితికి చేరింది. దీనివల్ల చింతలూరు ఆయకట్టు నుంచి దిగువ ప్రాంతాలకు చుక్కనీరు కూడా రాకపోవడంతో వరి పొలాలు బీటలు వారే ప్రమాదమేర్పడింది. దీనివల్ల సమీపాన బోరుబావులు ఉన్న యజమాను(భూస్వాము)లకు ఎకరాకు నాలుగు బస్తాల చొప్పున చెల్లించి నీటిని తోడుకోవలసిన పరిస్థితి. ఈ కొత్త కాలువ కింద ఆలమూరు, చింతలూరు, సంధిపూడి, అంగర గ్రామాలకు చెందిన సుమారు 1800 ఎకరాల ఆయకట్టుకు ఇంచుమించుగా ఇదే పరిస్థితి నెలకొంది. కాలువలను ఆధునీకరిద్దామనుకున్నా నిధుల లేమి వెంటాడుతుందని కొత్తగా ఎంపికైన పలు సాగునీటి సంఘాల అధ్యక్షులు ఆవేదన చెందుతున్నారు.



కలుపు మొక్కల వ్యర్థాలతో నిండిన చింతలూరు కొత్త కాలువ



చింతలూరులో సాగునీరు అందక బీటలు వారుతున్న పంట పొలాలు

కాలువకు పూడికను తీయకపోవడం వల్లే..

చింతలూరు కొత్త కాలువకు గత కొంతకాలం నుంచి పూడిక తీయకపోవడం వల్ల సాగునీరు సక్రమంగా పారడం లేదు. పంటకాలువ మధ్యమధ్యలో ఎత్తుపల్లాలు ఉండటంతో సాగునీరు కిందకు రాకపోవడంతో పాటు వ్యర్థాల వల్ల మరింత ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఈ కొత్త కాలువ ద్వారా వరి సాగు చేసే రైతన్నలు గత 20 రోజులుగా నీరందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఖరీఫ్ ప్రారంభంలోనే ఈ పరిస్థితులు కొనసాగుతుంటే రానున్న రోజుల్లో ఎండలు తీవ్రతరం అయితే పంటల పరిస్థితి ఏంటని రైతులు ప్రశ్నించడ పరిస్థితికి అద్దం పడుతుంది. వ్యవసాయాన్ని రైతులను ఆదుకోకపోతే వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం ఉందనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతుంది.

వంతుల వారీ విధానం వల్ల ఇబ్బందే..

రబీ సీజన్‌లో సాగునీరు వంతుల వారీ విధానం వల్ల రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఈనెల ఒకటి నుంచి ప్రారంభమైన వంతుల వారీ విధానం మార్చి తొమ్మిది వరకూ కొనసాగుతుంది. ఒకసారి సాగునీరు విడుదల తరువాత మరో వారం రోజుల వరకూ సాగునీరు విడుదల చేయకపోయే అవకాశం లేకపోవడం వల్ల శివారు ప్రాంతాలకు వరిసాగు ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇకనైనా ఇరిగేషన్ అధికారులు సత్వరమే స్పందించి పంట కాలువకు సాగునీటిని పారదర్శకంగా విడుదల చేయాలని, చెత్త చెదారం లేకుండా పరిశుభ్రం చేయాలని రైతులు కోరుతున్నారు.

సాగునీరు సక్రమంగా రావడం లేదు



చింతలూరు కొత్త కాలువకు ప్రతి సీజన్‌లోనూ సాగునీరుకు ఇబ్బందులే ఎదురవుతున్నాయి. కాలువల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో దిగువకు నీరు రావడం లేదు. అలాగే కాలువల్లో కూడా ఇప్పటి వరకూ పూడికను కాని, గుర్రపుడెక్కను కాని తొలగించకపోడం వల్ల సాగునీరు అందక బోర్లపైనే ఆధారపడుతున్నాం.

– అదపా పెదబాబు, రైతు, సంధిపూడి

వంతుల వారీ విధానంతో సక్రమంగా సాగునీరు



రబీ సీజన్‌లో ప్రతి ఎకరాకు సక్రమంగా సాగునీరు అందించాలన్న ఉద్దేశ్యంతో ఇరిగేషన్‌శాఖ వంతుల వారీ విధానాన్ని ప్రవేశపెట్టింది. దీనివల్ల నిరంతరాయంగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం శివారు ప్రాంతాలకు సైతం సాగునీరు అందించేందుకు వీలు కలుగుతుంది.

– టి.కృష్ణ త్రిమూర్తులు, ఇరిగేషన్ జేఈ, ఆలమూరు

పీహెచ్‌సీల్లో ప్రసవాలను ప్రోత్సహించాలి

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ఆయుష్మాన్ భారత్ లక్ష్యాలను అధిగమించడంతో పాటు ప్రసవాల సంఖ్య పెంపునకు ప్రత్యేక కృషి చేయాలని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సాయికిషోర్, డి.సువర్చలాదేవి అన్నారు. ఆయా గ్రామాల పీహెచ్‌సీల్లో మంగళవారం వైద్యారోగ్య, ఆశ సిబ్బందికి సమావేశం జరిగింది. జనవరి నెలలో సాధించిన ప్రగతిని అధికారులు వివరించారు. గ్రామ సచివాలయాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను వివరించి ఆరోగ్య సేవలపై పలు సూచనలు, సలహాలు అందజేశారు. హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్ బాలామణి పాల్గొన్నారు.

ఎస్సీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

మలికిపురం: మండలంలోని విశ్వేశ్వరాయపురం గ్రామ ఎస్సీ సంక్షేమ సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం సంఘ భవనంలో జరిగింది. అధ్యక్షులుగా చెవ్వాకుల సుందరరావు, ప్రధాన కార్యదర్శిగా పెయ్యల చిట్టిబాబు, కోశాధికారిగా కొంబత్తుల శ్రీను, ఉపాధ్యక్షులుగా నేతల ఫ్రాన్సిస్ రాజు, సహాయ కార్యదర్శిగా దేశాబత్తుల నాగరాజు, చైర్మన్‌గా జిల్లెల్ల బాబుప్రసాద్, సలహాదారుగా దొండపాటి రాంబాబు, కారుపల్లి ఏసురత్నం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘపెద్దలు గెడ్డం సింహా తదితరులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

కల్యాణ మహోత్సవాలు ప్రారంభం



సూర్యవాహనంపై స్వామివారు



కొపనాతి కృష్ణమ్మ విగ్రహానికి నివాళులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహస్వామివారి కల్యాణ మహోత్సవాలకు అర్చకులు, వేదపండితులు శ్రీకారం చుట్టారు. రథసప్తమి పర్వదినాన ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు స్వామివారికి విశేష పూజలు చేశారు. కేశవదాసుపాలేనికి చెందిన బెల్లంకొండ, ఉండపల్లి వారి కుటుంబాల సంయుక్త ఆధ్వర్యంలో సాయంత్రం 6.30 గంటలకు స్వామివారి ముద్రికాలంకరణను అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారిని పెండ్లికుమారుని, అమ్మవారిని పెళ్లి కుమార్తెను చేయడమే ముద్రికాలంకరణ ఘట్టం. కాగా ఉత్సవాలను పురస్కరించుకుని బెల్లంకొండ, ఉండపల్లి కుటుంబాలు ఆలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో సుమారు మూడువేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ ప్రాంగణంలోని ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ విగ్రహానికి ఆలయ అర్చకులు, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ శ్రీరాజా కలిదిండి కుమార రామగోపాలరాజాబహద్దూర్, ఉత్సవ కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, ప్రజాప్రతినిధులు, అగ్నికుల క్షత్రియ సంఘ సభ్యులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్వామివారి రథానికి అర్చకులు, ప్రముఖులు కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. గోవింద నామస్మరణల మధ్య భక్తులు, పల్లిపాలెం అగ్నికుల క్షత్రియులు మెరకవీధికి తరలించారు.

మద్యం, మాంసం విక్రయించకుండా చూడాలి

అంతర్వేది తీర్థంలో అక్రమ మద్యం, మాంసం విక్రయించకుండా ఎక్సైజ్ శాఖ పటిష్టమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ శ్రేణులు డిమాండ్ చేశారు. మంగళవారం అంతర్వేది దేవస్థానంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు పోతురాజు సురేష్ కార్యాలయంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, పార్టీ డ్రైయినేజీ సెల్ రాష్ట్ర కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు మాట్లాడుతూ, గతంలో హిందూ మనోభావాలు దెబ్బతినే విధంగా కొంత మంది అధికారులు పంచాయతీ వద్ద మాంసాహారాలుతో వంటకాలు ఏర్పాటు చేసి, పారిశుధ్య కార్మికులకు వడ్డించారని పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలు చోటు చేసుకుండా చూడాలని అధికారులను డిమాండ్ చేశారు.

వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ ఎన్నిక

రాజోలు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ కమిటీ ఎన్నిక మంగళవారం ఏకగ్రీవంగా జరిగింది. మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కమిటీ ఎన్నిక నిర్వహించారు. రాజోలు గ్రామశాఖ అధ్యక్షుడిగా అడబాల జానకిరామారావు, ప్రధాన కార్యదర్శిగా బొడ్డపల్లి ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా చిట్టూరి అప్పారావు, కార్యదర్శులుగా కొండా సత్యనారాయణ, విశ్వనాథపల్లి గోవిందరాజు, రాయవలస ప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా నల్లి శ్రీనివాస్, గొల్లపల్లి ప్రసాద్, ఉద్దరాజు రాజన్‌రాజు, కడలి చిట్టిబాబు, కుక్కల మురళీకృష్ణ, గుమ్మాపు ధర్మేంద్ర, నేతల ప్రదీప్, షేక్ బాషా, చెల్లూరి చక్రపాణిలు ఎన్నికయ్యారు. సర్పంచ్ రేవు జ్యోతి, ఎంపీటీసీలు చెల్లింగి లక్ష్మీఈశ్వరి, కొపనాతి పుష్పలత, నాయకులు దార్ల పెదబాబు, సాగి రంగరాజు, మట్టా నరసింహస్వామి, ఉచ్చుల దాసు, జడ్డు చినబాబు, బుంగ శ్రీను, మోకా సురేష్ తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన వైఎస్సార్ సీపీ రాజోలు గ్రామ కమిటీ కార్యవర్గం

'ఫీజు పోరు' మార్చి 12కు వాయిదా



నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావును సత్కరిస్తున్న పార్టీ నాయకులు

అయినవిల్లి: విద్యార్థులకు వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని కోరుతూ ఈనెల 5న తలపెట్టిన 'ఫీజు పోరు' కార్యక్రమాన్ని మార్చి 12వ తేదీకి వాయిదా చేసినట్లు మండల జెడ్పీటీసీ, పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం అయినవిల్లిలోని ఆయన స్వగృహంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని మెజారిటీ జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పోరును వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున, మా 'ఫీజు పోరు' కార్యక్రమానికి అనుమతి ఇవ్వాలని పార్టీ అధిష్టానం కోరిందన్నారు. దీనికి ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి స్పందన రాలేదన్నారు. దీంతో ఆ ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత, మార్చి 12వ తేదీన 'ఫీజు పోరు' నిర్వహించాలని పార్టీ అధిష్టానం ఆదేశించిందన్నారు. అనంతరం పార్టీ నాయకులతో భేటీ వారు ఆయనను సత్కరించారు.

వరి పంటను పరిశీలించిన శాస్త్రవేత్తల బృందం

మామిడికుదురు: నగరం గ్రామంలోని పంట పొలాలను ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విద్యాలయం జిల్లా సాంకేతిక సలహా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.నందకిశోర్, జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం వ్యవసాయాధికారి జె.మనోహర్ మంగళవారం పరిశీలించారు. సాగునీటి ద్వారా వ్యాపించే కలుపు మొక్కలు, నీటి తామర, సాల్వినియా, అంతర తామర తదితర కలుపు గుర్తించారు. దీని నివారణకు నాటిన 30–35 రోజులు అయితే 2–4 డి సోడియం సాల్ట్ ఎకరానికి 400 గ్రాములు పొలంలో పిచికారీ చేయాలన్నారు. ఆ సమయంలో నీరు దింపేయాలని సూచించారు. దీంతో ఇతర ఏ పురుగు మందులు లేదా తెగులు మందులు కలిపి పిచికారీ చేయకూడదని చెప్పారు. జింకు లోపంతో పాటు ప్రారంభ దశలో అగ్గి తెగులు, కాండం తొలచుపురుగును గమనించామని చెప్పారు. జింకు లోపం నివారణకు లీటరు నీటికి రెండు గ్రాముల జింకు సల్ఫేట్ కలుపుకుని అయిదు రోజుల వ్యవధిలో రెండు సార్లు స్ప్రే చేయాలని సూచించారు. కాండం తొలచు పురుగు నివారణకు క్లోరి ఫైరిపాస్ 2.5 మిల్లీలీటర్లు లేదా క్లోరంట్రానిలిప్రోల్ 0.3 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వారి వెంట ఏడీఏ ఎస్‌జేవీ రామ్మోహనరావు, ఏఓ బి.మృదుల పాల్గొన్నారు.



నగరంలో పంట పొలాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

నిత్యాన్నదానానికి రూ.పది వేల విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు కానూరుకు చెందిన చోడపనీడి శ్రీరామ్, లక్ష్మీచాముండేశ్వరి దంపతులు రూ.10,116 విరాళంగా అందించారు. విరాళం అందించిన దాత కుటుంబానికి ఆలయ అర్చకులు గొడవర్తి శ్రీనివాస్ స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. రథసప్తమి సందర్భంగా మంగళవారం విశేష సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.61,457 ఆదాయం వచ్చింది. 1500 మంది స్వామిని దర్శించుకున్నారు. 700 మంది స్వామి వారి అన్నప్రసాదం స్వీకరించారు. లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.6,465 ఆదాయం వచ్చింది. నిత్యాన్నదాన ట్రస్టుకు భక్తులు రూ.16,795 అందించారని ఆలయ ఈఓ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు.



దాతకు స్వామి చిత్రపటం అందిస్తున్న అర్చకులు శ్రీనివాస్

కిశోరి బాలికల వికాసమే ప్రభుత్వ లక్ష్యం

ఆలమూరు: కిశోరి బాలికల వ్యక్తిత్వ వికాసమే లక్ష్యంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడంతో పాటు రక్షణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిందని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ అధికారి గజలక్ష్మి అన్నారు. మండలంలోని మూలస్థాన అగ్రహారం, చెముడులంక జెడ్పీ హైస్కూళ్లలో మంగళవారం కిశోరి వికాసం కార్యక్రమం జరిగింది. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టీఎస్‌వీ నాగలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొని కిశోరి బాలికల వికాసానికి తీసుకోవలసిన చర్యలపై ప్రసంగించారు. అనంతరం ఇప్పటికే నియమించిన వెల్ఫేర్ అసిస్టెంట్, అంగన్వాడీ కార్యకర్త, ఉపాధ్యాయుడు, మహిళా పోలీసు బృందం హైస్కూల్ ఆవరణలో విద్యార్థినులతో సమావేశమైంది. రక్తహీనత, మహిళా అక్రమ రవాణా, లింగ వివక్షత, బాల్య వివాహాల నిర్మూలనకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్‌లు తమ్మన శ్రీనివాసు, లంక వరప్రసాదరావు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



చెముడులంకలో కిశోరి బాలికల వికాసంపై అవగాహన కల్పిస్తున్న ఐడీసీఎస్ అధికారులు

క్యాన్సర్‌పై విద్యార్థులకు అవగాహన



పెదపళ్లలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య ఆశ సిబ్బంది



కొత్తపేట డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు



నగరంలో పీహెచ్‌సీ ఉద్యోగులు నిర్వహించిన ర్యాలీ

కొత్తపేట: ఆహార నియమాలు పాటిస్తూ మంచి పౌష్టికాహారం తీసుకుంటే ఏ ఒక్కరూ క్యాన్సర్ బారిన పడకుండా ఉంటారని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసులు అన్నారు. మంగళవారం అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు క్యాన్సర్ అవగాహన సదస్సు నిర్వహించారు. జువాలజీ విభాగం ఆధ్వర్యంలో శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన నిర్వహించిన కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ క్యాన్సర్‌ను తెలుగులో 'కర్క రోగం' అని అంటారని తెలిపారు. మనిషి శరీరంలో కణాల పెరుగుదలలో నియంత్రణ లేక చాలా వేగంగా అస్తవ్యస్తంగా విభజన చెంది కణ సమూహాలను ఏర్పరుస్తాయని, వాటినే 'కణితి' (ట్యూమర్) అంటారని తెలిపారు. సమావేశంలో జువాలజీ అధ్యాపకులు బి.విజయకుమార్, పి.ప్రసన్నజ్యోతి, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు. క్యాన్సర్ డే సందర్భంగా స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగులకు అవగాహన క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు.

ఆలమూరులో..

ఆలమూరు: ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంబించడంతో పాటు దురలవాట్లకు దూరంగా ఉంటే క్యాన్సర్‌ను సమూలంగా నయం చేయవచ్చని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సువర్చలాదేవి, డి.సాయికిషోర్ అన్నారు. మండలంలోని ఆయా పీహెచ్‌సీల్లో మంగళవారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం జరిగింది. వైద్య ఆరోగ్య ఆశ సిబ్బంది వివిధ గ్రామాల్లోని పుర వీధుల్లో క్యాన్సర్ నివారణకు తీసుకోవసిలన జాగ్రత్తలను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. ఆహారపు అలవాట్లు మార్చుకోండి-క్యాన్సర్ మహమ్మారిని తరిమి కొట్టండి అంటూ నినాదాలు చేశారు. శరీరంలో ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉంటే సత్వరమే వైద్య పరీక్షలు నిర్వహించుకుని వ్యాధి నిర్ధారణ చేసుకోవాలని సూచించారు. హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి పాల్గొన్నారు.

స్క్రీనింగ్‌తోనే క్యాన్సర్‌పై విజయం సాధ్యం

మామిడికుదురు: ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ నుంచి ర్యాలీ ప్రారంభమైంది. క్యాన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తోనే సాధ్యం అంటూ ఉద్యోగులు నినాదాలు చేశారు. ఆరోగ్యకరమైన జీవన శైలి, ముందస్తు పరీక్షల ద్వారా క్యాన్సర్‌ని నివారించవచ్చన్నారు. పాశర్లపూడి-1 సచివాలయం పరిధిలో ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ముందస్తు పరీక్షతో క్యాన్సర్ నుంచి రక్షణ లభిస్తుందన్నారు. క్యాన్సర్ పరీక్షలు ఇంటి వద్దే చేస్తామని చెప్పారు. కార్యక్రమాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రావులపాలెంలో..

రావులపాలెం: మంచి ఆహారపు అలవాట్లు వ్యాయామం లాంటి జీవనశైలితో క్యాన్సర్ వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చని డాక్టర్ గ్రేస్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కేన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ గ్రేస్ హాజరై మాట్లాడారు. యువత చెడు వ్యసనాలు జోలికి వెళ్లకుండా మంచి జీవనశైలిని అలవాటు చేసుకోవాలని సూచించారు. అలాగే క్యాన్సర్ పై విద్యార్థులకు అవగాహన కలిగించారు. అనంతరం విద్యార్థులకు బీపీ, సుగర్ తదితర పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రథసప్తమి పూజలు



అయినవిల్లిలో సూర్యనమస్కారాలు చేస్తున్న వేదపండితులు, ఆలయ ప్రధానార్చకులు



అంబాజీపేటలో సూర్యనారాయణునికి పూజలు చేస్తున్న భక్తులు

అంబాజీపేట: రథసప్తమి పూజలను అంబాజీపేట మండలంలోని భక్తులు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సమీపంలో ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆర్యవైశ్య సంఘ సభ్యుల పర్యవేక్షణలో ఆలయ అర్చకులు చంద్రమౌళి ఆధ్వర్యంలో సూర్యభగవానునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సూర్య నమస్కారాలు, వేద పారాయణ, నవగ్రహ పూజలు చేశారు. ఆర్యవైశ్య మహిళలతో పారాయణ చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.

అయినవిల్లిలో

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరుని సన్నిధిలో మంగళవారం రథసప్తమి పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో సూర్యనారాయణమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుడు సూర్యనారాయణ స్వామికి విశేష పూజలు జరిపారు. సూర్యనమస్కారాలు నిర్వహించారు. ఆలయ ప్రాగణంలో స్వామికి ప్రత్యేక ప్రసాదం తయారు చేసి భక్తులకు వితరణ చేశారు.